ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

భగత్‌నగర్, మార్చి 1: ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగద న్నారు. ఉపాధి హామీ సిబ్బంది ఆర్థిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంట నే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారంటీలు అమలు చేసేదాక వదిలిపెట్టం

- ప్రజా సమస్యలపై కొట్లాడిన పార్టీ బీజేపీ
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

ఇల్లందకుంట, మార్చి 1: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేసేంత వరకు బీజేపీ పార్టీ పోరాడుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట మండలంలో బండి సంజయ్ ప్రజాహిత యాత్ర సాగింది. ఈ సందర్భంగా మల్యాల గ్రామంలో వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న-శ్రీనివాస్ ఆయనకు మంగళహారతితో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి మళ్లీ


ఇల్లందకుంటలో ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

మోదీని ప్రధాని చేసుకుందామని, అదేవిధంగా తెలంగాణకు అధిక నిధులు తెచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. కేసీఆర్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో పాటు ప్రజా సమస్యలపై కొట్లాడిన పార్టీ బీజేపీ అన్నారు. నాపై వంద కేసులు పెట్టారని, రెండు సార్లు జైలుకు పంపినా భయపడలేదన్నారు. బీజేపీ కార్యకర్తలపై కేసులు పెట్టినా బెదరలేదన్నారు. ఒకనాడు మేము మేడిగడ్డకు పోతే మమ్మల్ని పోలీసులను పెట్టి కొట్టించిన బీఆర్ఎస్ నేతలకు ఈ రోజు అదే గతి పట్టిందన్నారు. కాళేశ్వరం పేరుతో దోచుకున్న కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5లక్షల కోట్లు అప్పు చేసి పుట్టబోయే బిడ్డపై అప్పు భారం మోపిందన్నారు. అదే బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రెండు నెలల్లోనే రూ. 10వేల కోట్లు భవిష్యత్తు తరాలపై భారం మోపడం సరైన విధానం కాదన్నారు. యాత్రలో భాగంగా బండి సంజయ్ అందరినీ ఆప్యా యంగా పలకరించారు. మల్యాల, ఇల్లంద కుంట, సిరిసేడు, మర్రివాని పల్లె, సీతంపేట, బూజునూర్, వంతడుపుల మీదుగా ప్రజాహితయాత్ర సాగింది. శుక్రవారం రాత్రి జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ బస చేయనున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న-శ్రీనివాస్, నాయకులు అనిల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సాంబయ్య, ఎల్లారెడ్డి, శీలం శ్రీనివాస్, షఫీ, బైరెడ్డి వెంకటరమణారెడ్డి, రమేష్, సాయిరెడ్డి, విజయ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



మూలనపడ్డ మంచినీటి ప్రాజెక్టు

- రూ.29.20కోట్లు నీళ్ల పాలు
- తుప్పుపట్టిన 75,40 హెచ్‌పీ పంపులు
- తొమ్మిదేళ్లుగా ప్రాజెక్టు ముఖం చూడని అధికారులు
- దొంగలపాలైన విలువైన సామగ్రి

గంగాధర, మార్చి 1: పదేళ్ల క్రితం గంగాధర, పెగడపల్లి మండలంలోని 36 గ్రామాలకు రక్షిత శుద్ధ జలాన్ని అందించిన రూ. 12.20 కోట్ల ప్రాజెక్టును అధికారులు మూలకేశారు. కొడిమ్యాల మండలంలోని గ్రామాలకు మంచినీటిని అందించేందుకు రూ.17కోట్లతో నిర్మించిన మరో ప్రాజెక్టు కనీసం ట్రయల్ రన్ కూడా చేయకముందే వదిలేయడంతో లక్షల విలువైన పెద్దపెద్ద మోటర్లు ఎందుకు పనికిరాకుండా తుప్పు పట్టి పోతున్నాయి. మరి కొన్ని దొంగలపాలుకాగా ప్రాజెక్టు పరిసర ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

గంగాధర మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువులో 1999లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీపీడబ్ల్యుఎస్ పథకాన్ని ప్రారంభించారు. ఈ శాండ్ ఫిల్టర్ పథకంలో 60ఫీట్ల పొడవు,15ఫీట్ల వెడల్పుతో నాలుగు బెడ్లను నిర్మించి నీటిని శుద్ధి చేస్తారు. ఫిల్టర్ బెడ్లకు నీటిని పంపింగ్ చేయడానికి చెరువులో చెక్ వెల్ నిర్మించి 20 హెచ్‌పి సామార్థ్యం గల 3 కిర్లోస్కర్ పంపులను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు నడిపిస్తుంటే ఒకటి స్టాండ్ బైగా ఉంటుంది. శుద్ధి చేసిన నీటిని 3లక్షల సామర్థ్యం గల రెండు సంపుల్లోకి పంపిస్తారు. సంపుల్లో 75హెచ్‌పి సామర్థ్యం గల రెండు పంపులతో ఎల్లమ్మ గుట్టపై నిర్మించిన 1.5లక్షల వోహెచ్ఆర్


నిరుపయోగంగా మారిన వెంకటయ్యపల్లి స్కీం

ట్యాంకులోకి ఎక్కిస్తారు. ఈ ట్యాంకు నుంచి గంగాధర మండలం 33 గ్రామాలతో పాటు పెగడపల్లి మండలం ఐతుపల్లి,నందగిరి,తిరుమలాపూర్ గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తారు. ఇదంతా గత తొమ్మిదేళ్ల క్రితం నాటి శుద్ధ నీటి పథకంతో ఆయా గ్రామాల్లో మంచినీటిని తాగామని ప్రజలు చెపుతున్న మాట. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. దీంతో 12.20కోట్ల ప్రాజెక్టు మూతపడి విలువైన పెద్ద పెద్ద మోటర్లు తుప్పుపట్టిపోతున్నాయి. 75హెచ్‌పి,20హెచ్‌పి సామర్థ్యం గల మోటార్లు గత పదేళ్లుగా కనీసం పట్టించుకోక పోవడంతో తుప్పు పట్టి పోతున్నాయి. ఇక్కడ నిర్మించిన గదుల్లోని ఫ్యాన్లు, ఫర్నిచర్, తలుపులు,ప్రాజెక్టుకు ఉపయోగించిన విద్యుత్ మోటర్లు, విలువైన వైర్లు దొంగలు ఎత్తుకుపోయారు.ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

● ప్రారంభించకముందే మూసేసిన కొడిమ్యాల ప్రాజెక్టు

17కోట్ల రూపాయల ప్రాజెక్టు ట్రయల్ రన్ చేయకుండానే మూసేశారు. కొడిమ్యాల మండలానికి గంగాధర ఎల్లమ్మ చెరువు నుంచి రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ఆర్ఎస్ పథకాన్ని ప్రారంభించారు. 17 కోట్ల పథకం పనులు పూర్తయినా కనీసం ట్రయల్ రన్ చేయకుండానే వృథాగా వదిలేశారు. వెరసి జాక్ వెల్‌లో 15హెచ్‌పి సామర్థ్యమున్న కొత్త మోటర్లు నీటిలోనే తుప్పు పడుతున్నాయి. సంపుల్లో 40 హె చ్‌పి గల 3 మోటర్లు ఉన్నవో లేవో తెలయదని స్థానిక ప్రజలంటున్నారు. 4ఎంఎల్‌డి ఫిల్టర్ బెడ్లు పనికిరాకుండా పోయాయి. 60వేల వోహెచ్‌బీఆర్ కెపాసిటీ గల ట్యాంకు వృథాగా ఉంది. ఇక్కడి నుంచి పంపింగ్ చేసి కొడిమ్యాల మండలం చెప్యాలలోని సంపులో నీటిని పోయిస్తారు. అక్కడి నుంచి కొడిమ్యాల మండలంలోని అన్ని గ్రామాలకు నీటిని సరఫరా చేయాలని ప్రణాళిక సిద్ధం చేసి చెప్యాలలో ఒక సంపు, అందులో పెద్ద మోటర్, వాచ్‌మెన్ గది, వోహెచ్‌బిఆర్ ట్యాంకు నిర్మించి వదిలేశారు. మిషన్ భగీరథ పథకం ప్రారంభంతో 17కోట్ల ప్రాజెక్టు కనీసం ట్రయల్ రన్ కాక ముందే మూసేశారు. దీంతో ఎంతో ఉపయోగకరంగా అధికారులు నిర్ణయించి ప్రజాధనంతో చేపట్టిన ప్రాజెక్టు నిధులు నీళ్లపాలయ్యాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల రక్షిత నీటి శాఖ అధికారులు ఇక్కడి కి వచ్చి పరిశీలించినట్లు సమాచారం. ఏది ఏమైనా భగీరథ నీటితో రక్షిత నీటికి నోచుకోక రెంటికి చెడ్డ రేవడిలా తయారైయ్యామని రెండు మండలాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టును అధికారులు పరిశీలించి పనికి వచ్చే యంత్రాలు ఏవైనా ఉంటే వినియోగంలోకి తీసుకురావాలని, దొంగలపాలుకాకుండా ప్రాజెక్టు సామగ్రిని కాపాడి అసాంఘిక కార్యకలాపాలు నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.


వృథాగా ఫిల్టర్ బెడ్లు

నిర్మించి నాలుగేళ్లు.. ఇవ్వడానికి ఎన్నాళ్లు?

పేదలకు అందని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- ఇళ్ల చుట్టూ పెరిగిన ముళ్లపొదలు
- తలుపులు, స్విచ్‌బోర్డులు, డ్రైనేజీ పైపులు ధ్వంసం

హుజూరాబాద్, మార్చి 1: హుజూరాబాద్ పట్టణ శివారులోని గణేష్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి నాలుగేళ్లు అవుతున్నా లబ్ధిదారులకు అందజేయడం లేదు. పేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఏర్పడిన తర్వాత పేద ప్రజల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గానికి 2వేల ఇళ్లు మంజూరు చేశారు. అప్పటి మంత్రి ఈటల రాజేందర్ గణేష్‌నగర్‌లో 2018లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం శంకుస్థాపన చేశారు. మొదటి విడతలో 500ఇళ్లు నిర్మించేందుకు కాంట్రాక్టు పద్ధతిన ఏజెన్సీకి అప్పగించారు. ఈ ఇళ్ల నిర్మాణం నత్తనడకగా సాగింది. 2019లో ఇళ్ల నిర్మాణం


ఇళ్ల చుట్టూ పెరిగిన ముళ్ల పొదలు

పూర్తయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించడంలో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో అప్పటి మంత్రులు హరీష్‌రావు, గంగుల కమలాకర్‌లు పిలుపునిచ్చారు. దీంతో 10వేల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అప్పటి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ఎన్నికల ముందు ఇస్తాడనే ఆశతో లబ్ధిదారులు ఎదురుచూడగా ఎన్నికల తర్వాత ఇస్తానని హామీ ఇచ్చారు. ఈలోగా ప్రభుత్వం మారింది. ప్రస్తుతం డబుల్ బెడ్‌రూం ఇళ్లలోని కరెంటు స్విచ్ బోర్డులు, కిటికీలు, తలుపులు, డ్రైనేజీ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. డబుల్ బెడ్‌రూం కాలనీలో ముళ్ల పొదలతో నిండిపోయింది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఇళ్లు అందని ద్రాక్ష లాగా మారిపోయాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



ధ్వంసమైన డ్రయినేజీ ఛాంబర్

హుజూరాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్


నగరంలో రాపిడ్‌యాక్షన్ ఫోర్స్ బలగాల ఫ్లాగ్ మార్చ్

కరీంనగర్ క్రైం, మార్చి 1: ఫెమిలైజేషన్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా కరీంనగర్‌కు వచ్చిన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో శుక్రవారం కరీంనగర్ టౌన్ డివిజన్‌లోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో రాపిడ్‌యాక్షన్ ఫోర్స్(ఆర్‌ఏఎఫ్)బలగాలతో పాటు స్థానిక పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీం పోలీసులు పాల్గొన్నారు. కరీంనగర్‌లోని ఇందిరాచౌక్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ గోదాంగడ్డ, కశ్మీర్‌గడ్డ, రైతుబాజర్ వరకు నిర్వహించారు. అనంతరం కిసాన్‌నగర్, హుస్సేనిపుర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ కమాండెంట్ బిస్వ రంజన్ సాహు, అడిషనల్ డీసీపీ సి రాజు, ఏసీపీ నరేందర్, సీఐలు రవీంద్ర రోషన్(ఆర్‌ఏఎఫ్), లలితగోప్ నారాయణ్(ఆర్‌ఏఎఫ్), ఓ వెంకటేష్, శ్రీనివాస్, శ్రీలత, సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఏ చిన్న పొరపాటు జరిగినా అధికారులదే బాధ్యత
- 3,4 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించాలి
- వీడియో కాన్ఫరెన్సులో సీఎస్ శాంతికుమారి

కరీంనగర్ టౌన్, మార్చి 1: ఇంటర్, ఎసెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణ, ప్రజా పాలన సహాయ కేంద్రాల ప్రారంభంపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ పరీక్షల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా కూడా అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పరీక్షా కేంద్రానికి చేరుకునే సమయం నిమిషం గడువు కాకుండా 3,4 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కూడా పరీక్షకు అనుమతించాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తుల ఎంట్రీ సమయంలో జరిగిన తప్పొప్పులను సవరణకు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి, డీఈసీ సభ్యుడు కె.రవీందర్‌రెడ్డి, ఆంజనేయరావు, జడ్పీ సీఈవో ఎం.శ్రీనివాస్, డీఈవో జనార్ధన్‌రావు, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్, కొత్తపల్లి, చొప్ప దండి, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్లు రమేశ్, నాగరాజు, సమ్మయ్య పాల్గొన్నారు.



టెలికాన్ఫరెన్సులో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ శాంతికుమారి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

● ఆపదమిత్ర వలంటీర్ల ఎంపిక పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్: ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, అనుకోకుండా ఏదైనా ప్రమాదాలు జరిగినపుడు బాధితులను కాపాడేందుకు ఆపదమిత్ర వలంటీర్ల ఎంపికను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆపదమిత్ర వలంటీర్ల ఎంపిక ప్రక్రియపై వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 300 మంది ఆపదమిత్ర వలంటీర్లను ఎంపిక చేయనున్నా మని అన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, నెహ్రూయువ కేంద్ర ప్రతినిధులు, గజ ఈతగాళ్లు, క్రీడాకారులు, పంచాయతీ కార్మికులు, స్వశక్తి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ టీచర్లకు వలంటీర్ల ఎంపికలో ప్రాధాన్యం కల్పించాలని అన్నారు. వలంటీర్లకు 12 రోజులు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు వారు అర్హులని చెప్పారు. డీఆర్వో పవన్‌కుమార్ వలంటీర్ల ఎంపిక ప్రక్రియ, శిక్షణపై అవగాహన కల్పించారు.

● మ్యూజియాన్ని ఆధునీకరించండి

ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పురాతన)లోని మ్యూజియంను ఆధునీకరించాలని కలెక్టర్ పమే లా సత్పతి అధికారులను ఆదేశించారు. మ్యూజియం భవనాన్ని పరిశీలించారు. ఇలాంటి పురాతనమైన మ్యూజియం భవనాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఇందుకు తగిన అంచనాలను రూపొందించాలని, నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

● చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ టౌన్: చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులో హీరోయిజం చూపించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ ముకరంపుర ఉన్నత పాఠశాల (పురాతన)లో ఏర్పాటు చేసిన స్నేహిత అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అక్కాచెల్లెల్లను, తల్లిదండ్రులను గౌరవించాలని, మంచి ప్రవర్తనతో ముందుకు సాగాలని అన్నారు. ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా లక్ష్యాలను ఎంచుకోవాలని, సెల్‌ఫోన్లను ఎక్కువగా వినియోగించవద్దని సూచించారు. ఆపద సమయంలో 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సిహెచ్.జనార్ధన్‌రావు, మార్కెటింగ్ డీడీ పద్మావతి, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృపారాణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత, పాఠశాల హెచ్‌ఎం చాంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో ముగ్గురు డీబార్

కరీంనగర్ టౌన్/సైదాపూర్, మార్చి1: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రెండవ రోజు జరిగిన ఆంగ్లం పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడటంతో వారిని డిబార్ చేశారు. శుక్రవారం నిర్వహించిన ఆంగ్లం పరీక్షకు 16,862 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 986 మంది గైర్హాజరయ్యారు. 15,876 మంది పరీక్షలు రాశారు. వీరిలో జనరల్ విభాగంలో 15,202 మంది విద్యార్థులకు 466 మంది హాజరుకాలేదు. 14,736 మంది పరీక్షలు రాశారు. ఒకేషనల్ విభాగంలో 1,660 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 520 మంది గైర్హాజరు కాగా 1140 మంది పరీక్షలు రాసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సైదాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు కాపీయింగ్ చేస్తుండగా స్క్వాడ్ వారిని పట్టుకొని మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేసి డీబార్ చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మహేందర్‌రావు తెలిపారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 1: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫో ర్స్ సీఐ కె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం భగత్‌నగర్‌లో నిర్వహించిన దాడుల్లో 535 గ్రాముల గంజాయి పట్టుబడింది. గంజాయిని కలిగి ఉన్న ముగ్గురు నిందితులు శాంతినగర్‌కు చెందిన ఆర్ శశికుమార్, పెగడపల్లికి చెందిన పి రామకృష్ణ, వరంగల్‌కు చెందిన బి జయంత్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేవామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టుబడి నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు రెండు మొబైల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి కేసుల్లో అనుమానితులుగా ఉన్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించగా వారిని బైండోవర్ చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం

గణేశ్‌నగర్, మార్చి 1: తెలంగాణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం శుక్రవారం హైదరాబాదులో ఏర్పాటైంది. అధ్యక్షుడిగా బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీధర్ రావు, పరమేష్, ఉపాధ్యక్షులుగా నారాయణ గౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షులు ప్రకాష్, గింజల రమణారెడ్డి, సుందర్ రాజ్, కార్యదర్శులు హరిస్మరణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ యాదా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి గాయత్రి కళాశాల కరస్పాండెంట్ యెల్లెంకి శ్రీనివాస్, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో చెరుకు పంట దగ్ధం

మెట్‌పల్లి రూరల్, మార్చి 1 : మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన నల్ల విఠల్ అను చెరుకు రైతు పంట గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం లోని నల్ల వెంకటేశ్వర్లు చెరుకు పంట వద్ద పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో చెరుకు పంటలో ఎగిసిపడుతున్న మంటలను గమనించిన స్థానికులు వెంటనే వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే అగ్ని మా పక సిబ్బందికి సమాచారం అందించి తోట వద్దకు వెళ్లాడు. మంటలను స్థానిక రైతులతో కలిసి ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి పంట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ. 2లక్షలు ఆస్థి నష్టం వాట్లిందని వెంకటేశ్వర్లు అవేదనతో తెలిపాడు. జరిగిన ప్రమాదంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ఎవరైనా అనుమాణితులు ఉంటే తెలపాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిందా ? ఎవరైనా కావాలని చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- గన్నేరువరంవాసి మృతి

నార్సింగ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్ గుట్టపై మూవీ టవర్స్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కరీంనగర్ జిల్లా గన్నేవరం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్ (45) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం కోకాపేట్‌కు రాగా రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, మార్చి 1: కరీంనగర్- జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలతో ఒకరు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన తెట్టు ఎల్లయ్య(47) జగిత్యాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

బాబ్లీ గేట్లు ఎత్తివేత

- దిగువ గోదావరిలోకి 0.6 టీఎంసీల నీటి విడుదల
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు


బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పొరుగున మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శుక్రవారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల నిమిత్తం ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేది నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు. అదే విధంగా వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి మార్చి 1వ తేదీన ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు 5 గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. ఈ కార్యక్రమంలో పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లా జూనియర్స్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 1: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లాలోని కొత్తపల్లి మండల పరిధిలోగల అకాడమి హైట్స్ పబ్లిక్ పాఠశాల మైదానంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు 01-01-2004 తరువాత జన్మించిన వారు సంబంధిత జనన ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో పీఈటీ శ్రీధర్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

11న జేఎల్ఎం సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, మార్చి 1: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ఆరో విడత జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను 11న సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి యొక్క చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. జాబితాను నోటీసు బోర్డులో కూడా ఉంచామన్నారు. కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో కాల్ లెటర్‌ను పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, స్తంభం ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలను నమ్మవద్దని కోరారు.

49మంది మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 1: జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 49 మంది మందుబాబులకు జరిమానా విధిస్తూ శుక్రవారం సిరిసిల్ల ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన తీర్పు ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 33 మంది మందుబాబులను కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ 8 మందికి రూ2 వేల జరిమానా, 25 మందికి రూ.1000 జరిమానా విధించారని ఎస్సై రమాకాంత్ తెలిపారు. అదేవిధంగా కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 20 రోజుల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందిని కోర్టులో హాజరుపరచగా తొమ్మిది మందికి రూ .2 వేలు, ఏడుగురికి రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

మూడు ద్విచక్రవాహనాలు దహనం


కాలిపోయిన వాహనాలు

తంగళ్లపల్లి, మార్చి 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు నిలిపిన మూడు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో దహనమయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున గుగ్గిళ్ల అంజనేయులు ఇంటి ముందు మూడు ద్విచక్రవాహనాలు పార్క్ చేశారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంల రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయి ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. ఇంటి ముందు రేకులు, షెట్టర్, పీవోపీకి సైతం పెట్రోల్ చల్లడంతో మంటలు చేలరేగి కాలిపోయాయి. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు గడ్డం సాయికృష్ణను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, మార్చి 1: మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన పలికొండ నవీన్ (31) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ తనకు పిల్లలు పుట్టడంలేదని కొంత కాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. నవీన్ తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- రేవంత్‌కు, కేటీఆర్‌కు నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా?
- కేటీఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్ నుంచి పోటీ చేయాలి
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, మార్చి 1: ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్ సీఎం రేవంత్‌ను పదవికి రాజీనామా చేసి పార్లమెంట్ బరిలో నిలవాలని సవాలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. కేటీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. విమర్శించే ముందు ఆత్మవిమర్శ చేసుకొని మాట్లాడాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరిస్థితి అధ్వానంగా మారిందని, కేటీఆర్ తీరుతో ఆఖరికి గెలుస్తదనే నమ్మకంతో ఉన్న మెదక్ సీటుకూడా గెలిచే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కేటీఆర్‌కు దమ్ముంటే కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లలో పోటీ చేసి గెలవాలని జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. తుమ్మడి హెట్టి వద్ద 160టీఎంసీల నీరు లభ్యత ఉందని నివేదిక ఉండగా, అక్కడి నుంచి ప్రాజెక్టు నిర్మాణంను కిందికి దించేందుకు మరో నివేదికను తయారుచేశారన్నారు. తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఒక్క లిఫ్ట్‌తో ప్రాజెక్టుకు నీరు చేరేదన్నారు. మేడిగడ్డ పిల్లరు కుంగడం టెక్నికల్ లోపమని సమర్థించుకోవడం విచారకరం అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు అందవని ప్రచారం చేశారని, ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చారని దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. కానీ ప్రజా ఆశీర్వాదంతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను దశల వారీగ అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన తొలి గ్యారంటీ ఉచిత బస్సు సౌకర్యం నూటికి నూరు శాతం విజయవంతం అయ్యిందని, గృహవినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును కూడా మార్చి ఒకటి నుంచి అమలు చేసిందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకోని, రేషన్‌కార్డు కలిగిన వారు స్థానిక మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.500కే సిలిండర్ కార్యక్రమం అమలుతో పాటు, గృహ నిర్మాణం పథకం కూడా వారం రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉందన్నారు. ఇండ్ల పంపిణీలో పారదర్శకత పాటించేలా చర్యలు గైకొంటామన్నారు. ప్రజాసంక్షేమమే పరమాధిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఇప్పటికైనా కేటీఆర్ స్థాయికి తగిన విధంగా మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కొత్తమోహన్, గాజుల రాజేంధర్, సిరాజుద్దీన్ మన్సూర్, షేక్ చాంద్‌పాషా, జున్ను రాజేంధర్, బీరం రాజేష్, మహిపాల్, బొల్లి శేఖర్ తదితరులున్నారు.

● కాంగ్రెస్‌లో చేరికలు

జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చెక్కపెల్లి మోహన్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే సారంగాపూర్ మండలం పోచంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ పల్లికొండ రమేష్‌తో పాటు పలువురు గంగపుత్ర సంఘ నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా వీరికి కాంగ్రెస్ కండువా కప్పిన జీవన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 1: మండలంలోని బండ లింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో పుణ్యాహవచనం గతస్థాపితార్చన, యంత్రమూర్తుల ప్రతిష్ఠాపన, నిత్యహోమం, జయాది హోమం, ప్రాయశ్చిత్తహోమం, బలిహరణ, పూర్ణాహుతి, కుంభాషేకం ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను పురోహితులు ఘనంగా జరిపారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

తిమ్మాపూర్, మార్చి1: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం ఉదయం మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనకాల నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో బెలున్స్ తెరచుకోవడంతో అందులో ఉన్న వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడాడు. కారులో మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన రాజేందర్ అనే వ్యక్తి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

ట్రాలీ ఆటో బోల్తా.. ఒకిరికి గాయాలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 1: సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వస్తున్న ఆటో పదిర సమీపంలోని వంతెన ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి ఆటో బోల్తా కొట్టింది. ట్రాలీ ఆటోలో తన కుమారుడితో ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న నారాయణపూర్ గ్రామానికి చెందిన మోతే దేవదాస్ గుంతలో పడి ఆటో బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు డ్రైవర్ పైఉన్న ఆటోను పక్కకు జరిపి 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి 1: మండలంలోని చల్లూరు గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మానకొండూరు మండ లం ఊటూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించామని, ఈ మేరకు కనుకుంట్ల శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

సీజ్ చేసిన వాహనాలు వేలం వేస్తాం

- ప్రభుత్వానికి ఆదాయం కల్పించడమే ధ్యేయం
- డీటీసీ పెద్దింటి పురుషోత్తం


వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న డీటీసీ పెద్దింటి పురుషోత్తం

తిమ్మాపూర్, మార్చి1: రవాణా శాఖ కార్యాలయంలో ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన వాహనాలను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కమిషనర్ పెద్దింటి పురుషోత్తం అన్నారు. స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న డ్రైవింగ్ ట్రాక్ సమీపంలో ఉన్న పాడుబడ్డ వాహనాలను, వాహనాలను ఫిటెనెస్, రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరును డీటీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా సీజ్ చేసిన వాహనాల జాబితా తయారు చేసి వారం రోజుల్లోగా తనకు అందజేయాలని ఏఎంవీఐ స్రవంతిని ఆదేశించారు. కార్యాలయానికి ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ కోసం వచ్చే భారీ వాహనాలు, ఆటోలకు నాణ్యమైనా రేడియం స్టిక్కర్లను ముందు, వెనుకాల కచ్చితంగా వేయించాలని వాహనదారులకు సూచించారు. స్టిక్కర్లు వేసుకోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. నిర్మాణం పూర్తయిన డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. డ్రైవింగ్ ట్రాక్ కు సంబంధించిన పెండింగ్ పనులపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి నిధులు సమకూర్చాలని కోరామని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమాకూర్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజురు అయిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిచేత ఈ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతామని డీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, సిబ్బంది శ్రీనివాస్, రహూఫ్, గౌస్ పాష తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు

- చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది
- మూడు రోజుల పాటు నిర్వహణ


సిద్ధం చేస్తున్న పందిళ్లు

వేములవాడ, మార్చి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 7వ తేదీ నుంచి మార్చి 9 వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం ఆలయ అధికారులు భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు, వసతి గదుల కాంప్లెక్స్‌లకు కొత్తగా రంగులు వేయడంతో పాటు క్యూలైన్ల క్రమబద్ధీకరణ, విద్యుత్ దీపాలతో అలంకరణ, చలువ పందిళ్ల, కలకత్తా పందిళ్ల ఏర్పాటు, శివార్చన వేదిక నిర్మాణం, తాత్కాలిక పార్కింగ్ లాట్స్ ఏర్పాటు, యాత్రికులకు తాగునీటి వసతి కోసం నల్లాల ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జాతర ప్రారంభం లోగా ఏర్పాట్లు పూర్తి చేస్తామని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఆలయ అధికారులు తెలిపారు.


రోడ్డు చదును చేస్తున్న సిబ్బంది

భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 1: భూ కబ్జాలకు పాల్పడిన పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ అర్బన్ పరిధిలోని తెట్టెకుంట పరిధిలో సర్వే నంబరు 6 లో గల 126 చదరపు గజాల స్థలాన్ని నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి, తనను బెదిరించి ఆక్రమించేందుకు ప్రయత్నిం చాడని బాధితుడు కరీంనగర్‌కు చెందిన బెంజిమెన్ ఫిర్యాదు మేరకు. కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.

70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, మార్చి 1: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో రవాణాకు సిద్ధంగా ఉన్న రెండు వ్యాన్‌లలో లోడ్ చేయబడి ఉన్న సబ్సిడీ బియ్యంకు సంబంధించిన సమాచారాన్ని అందుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించి దేవునిపల్లి గ్రామానికి చెందిన వారణాసి సమ్మయ్య ను అదుపులోకి తీసుకుని రెండు వ్యాన్లలో ఉన్న బియ్యంతో పాటు సుల్తానాబాద్ పోలీసులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

7న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మానం


మాట్లాడుతున్న బీసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి వైద్యుల అంజన్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి 1: బీసీ కుల గణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి ప్రభాకర్‌కు మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే అభినందన సభ, ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వైద్యుల అంజన్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఫిబ్రవరి 27న బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో బీసీ కుల గణన తీర్మానం ప్రవేశ పెట్టారన్నారు. కృతజ్ఞతగా బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఈనెల 7వ తేదీన గురువారం కరీంనగర్‌లోని ఇంద్ర గార్డెన్స్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బీసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, బీసీ సంఘాల, కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో లైవ్ సర్జరీలు


జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న వైద్యులు

సుభాష్‌నగర్, మార్చి 1: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో శుక్రవారం లైవ్ సర్జరీలను నిర్వహించారు. నగరంలోని రెనే ఆసుపత్రిలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ మానస్ పాణిగ్రహి పాల్గొని అత్యాధునిక వైద్య విధానంతో మెదడులోని కంతిని తొలగించారని సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. లైవ్‌లో వివరిస్తూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. ఈనెల 2న నగరంలోని వి కన్వెన్షన్‌లో సాయంత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సంతానసాఫల్య కేంద్రం డాక్టర్‌పై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మార్చి 1: సంతానం కోసం వైద్య చికిత్సలు పొందేందుకు ఒక మహిళ కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం ఆసుపత్రికి వెళితే డబ్బులు తీసుకుని చికిత్స అందించకుండా బెదిరించారని వచ్చిన ఫిర్యాదుతో డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం డాక్టర్ పద్మజతోపాటు ఆసుపత్రి సిబ్బందిపై కేసు నమోదు చేశామని రెండో టౌన్ సీఐ ఓ వెంకటేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తిరుమణి నాగలక్ష్మి అనే మహిళ సంతానం లేకపోవటంతో కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం ఆసుపత్రిలో సంప్రదించింది. సంతానం కలిగేందుకు చికిత్సకోసం డాక్టర్ పద్మజ, ఆసుపత్రి సిబ్బంది కలిసి ఆమె వద్ద ఐదు లక్షల రూపాయలు తీసుకున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చికిత్స అందించకుండానే మరో 80 వేల రూపాయలు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది అడిగారని, చికిత్స చేయకుండా మళ్లీ డబ్బులు ఎలా ఇస్తామని అడగగా డాక్టర్‌తోపాటు సిబ్బంది తనను, తన భర్తను దూషించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆసుపత్రిలో బంధించి, చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ పద్మజ, సిబ్బందిపై కేసు నమోదు చేవామని సీఐ ఓ వెంకటేష్ తెలిపారు.

మార్టిగేజ్ చేసిన భూమి మరొకరికి విక్రయం

- మోసగించిన దంపతుల అరెస్టు - 14 రోజుల పాటు రిమాండ్


నిందితులను జైలుకు తరలిస్తున్న ఎస్సై

కరీంనగర్ క్రైం/గంగాధర, మార్చి 1: భూమిని మార్టిగేజ్ చేసి మరొకరికి విక్రయించిన దంపతులపై కేసు నమోదైంది. ఒక వ్యాపారి నుంచి 56 లక్షల రూపాయల డబ్బులు అప్పుగా తీసుకుని, హామీగా 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మార్టిగేజ్ చేశారు. దంపతులు తిరిగి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి మరొకరికి విక్రయించారు. ఈ మేరకు దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గంధీరోడ్‌కు చెందిన సింగిరెడ్డి మోహన్‌రెడ్డి అనే వ్యాపారి వద్ద నుంచి గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన మూల కనకయ్య 2016లో 30 లక్షల రూపాయలు, 2017లో మరో 26 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. హామీగా మాల కనకయ్య, అతని భార్య మాల మంజుల పేరిట ఉప్పర మల్యాలలో ఉన్న 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మోహన్‌రెడ్డి పేరిట మార్టిగేజ్ చేశారు. రెండు బ్యాంక్ చెక్‌లను కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని దాచిపెట్టి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి ఇతర వ్యక్తులకు విక్రయించారని బాధితుడికి తెలిసి వారిని నిలదీశారు. దీంతో చంపుతానని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి, విచారణ జరిపిన గంగాధర పోలీసులు బాధితుడి ఫిర్యాదులో పేర్కొన్న విషయాలు నిజమేనని వెల్లడైంది. దీంతో దంపతులను శుక్రవారం అరెస్టు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారని, కరీంనగర్ జిల్లా జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

అద్దకం కార్మికుడి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 1: సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నాగుల శ్రీకాంత్(36) అనే అద్దకం కార్మికుడు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.... సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ అద్దకం కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాంత్, లావణ్య దంపతులకు 14ఏళ్ల క్రితం వివాహమైంది. అతడికి భార్య లావణ్య, కుమారుడు, కూతురులు ఉన్నారు. భార్య, భర్తలిద్దరు ఇంట్లోనే ఉన్నారు. భార్య ఇంట్లో ముందు గదిలో బీడీలు చేస్తుండగా శ్రీకాంత్ బెడ్‌రూంలోకి వెళ్లాడని, ఏదో చప్పుడు వినిపించడంతో వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉన్నట్లు చూసి వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం అందించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని భార్య లావణ్య చెబుతోంది. అప్పటికే శ్రీకాంత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య, భర్తల మధ్య తరుచూ గొడవలుజరుగుతున్నాయని, మద్యానికి బానిసైన శ్రీకాంత్ మృతిపై అనుమానాలు ఉన్నాయని శ్రీకాంత్ తల్లి సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్య

కొడిమ్యాల, మార్చి 1: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన కోల జమున(22)పెళ్లి ఇష్టం లేక శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు వివాహం చేయటానికి తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. వివాహం చేసుకోవటం ఇష్టం లేక జీవితంపై విసిగి పోయి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను ఆమెను వేములవాడ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి కోల భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వావిలాలకు చేరుకున్న ప్రజాహిత యాత్ర



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

జమ్మికుంట రూరల్, మార్చి 1: ఎంపీ బండి సంజయ్ కుమార్ చేపట్టిన ప్రజాహిత యాత్ర శుక్రవారం రాత్రి జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చేరుకుంది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి బండి సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఓ సాధారణ ముదిరాజ్ ఇంట్లో ఎంపీ బస చేశారు. ముదిరాజ్ కుటుంబ సభ్యులు ఆయన్ను ఎంతో ఆప్యాయతతో ఆహ్వానించారు. గ్రామంలో పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, ఆకుల రాజేందర్, సంపెల్లి సంపత్, జీడి మల్లేష్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● శనివారం ఉదయం పాపక్కపల్లి, శంభునిపల్లి, తనుగుల, గండ్రపల్లి, నాగంపేట, శాయంపేట, ధర్మారం, కొత్తపల్లి, గాంధీ చౌరస్తా వరకు ప్రజాహిత యాత్ర కొనసాగనుంది.

నేడు 'శ్రీపాద' స్మారక పురస్కారాల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, మార్చి 1: కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీపాద స్మారక పురస్కారాలను శనివారం ప్రదానం చేయనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు జి కృపాదానం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తరుణంలో శనివారం 89వ జయంతి సందర్భంగా కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, మానేరు విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10-30 గంటల నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీపాద స్మారక పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సాహిత్య విభాగంలో డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, యోగాచార్య సంపత్‌కుమార్, కళారంగంలో మంచాల రమేశ్, గొల్లపల్లి రవీందర్, ఎండి ఇస్మాయిల్, దయానంద్‌గాంధీ, రతన్‌కుమార్‌కు పురస్కారాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్య కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

సుభాష్‌నగర్, మార్చి 1: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని కిసాన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, డెమో రంగారెడ్డి అవగాహన కల్పించారు. ఆడపిల్లలు, మగపిల్లలు అందరు సమానమే అని అన్నారు. కొందరు వివక్ష చూపించి, గర్భస్థ దశలోనే లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించడం, పరీక్షలు చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షిస్తారని తెలిపారు.

యూపీ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ అర్బన్, మార్చి 1: ఉత్తరప్రదేశ్‌లో ఓ పార్క్‌లో రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటం బోర్డును ఏర్పాటు చేసినందుకు సుమేశ్ అనే దళిత యువకుడిని అన్యాయంగా కాల్చి చంపిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్‌చైర్మన్ వెన్న రాజమల్లయ్య కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆయన శుక్రవారం ఒక వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో దళితులపై జరుగుతున్న హత్యలు, అన్యాయాలు, మానభంగాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యలను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర దళిత యువకుడు సుమేశ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, మార్చి 1: నగరంలోని 58వ డివిజన్ జ్యోతినగర్ మోర్ సూపర్ మార్కెట్ వద్ద రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల కోసం రోడ్డును తవ్వి పనులు పూర్తిచేయకుండా మధ్యలో వదిలిపెట్టారని, దీనితో డివిజన్ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని డివిజన్ కార్పొరేటర్ రాపర్తి విజయ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తిచేసి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతిని శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. నాలుగునెలల క్రితం సీఎం హామీ నిధులతో పనులు ప్రారంభించి, అసంపూర్తిగా వదిలివేశారని చెప్పారు. సమస్యలపై మున్సిపల్ సమావేశంలో మేయర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. వెంటనే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



మల్లాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మార్చి 1: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మల్లాపూర్, కాసారం, కురిక్యాల, వెంకంపల్లి, ఉప్పరమల్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి, ఆచంపల్లి గ్రామాల్లో శుక్రవారం సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆయన వెంట జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సన్మానం

జమ్మికుంట రూరల్, మార్చి 1: జమ్మికుంట పట్టణంలోని విస్‌డమ్ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు అయిన మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలు, కానిస్టేబుళ్లు, గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శుక్రవారం సన్మానించారు. మారబోయిన రేణుక, అగ్గి నవ్య, భవాణి, ఒజ్జ కోమల, బుర్ర శ్రీలేక, గుడిపాటి పద్మారెడ్డి, లావణ్య, స్రవంతిలను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో చైర్మన్ దబ్బెట విజయలక్ష్మి-రవీందర్, వైస్ చైర్మన్ బండి అరుణ-ప్రభాకర్, కరస్పాండెంట్ మల్లాడి మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ కూర విజేందర్‌రెడ్డి, పాకాల శ్రీనివాస్‌రెడ్డి, కాంతాల మల్లారెడ్డి, నాతాడి మంజుల పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, మార్చి 1: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పచ్చునూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఐదో వార్షికోత్సం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, ఎంపీడీవో నరసయ్య, ఎంఈవో మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయులు గొల్ల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు

- నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి, మాట్లాడుతున్న పడాల రాహుల్

కరీంనగర్ అర్బన్, మార్చి 1: చీకటి ఒప్పందాలతో రాజకీయాలు చేస్తున్న బండి సంజయ్‌కుమార్‌కు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడా అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరించి, దేవుని ప్రస్తావన తీసుకువచ్చి బోగస్ మాటలు చెప్పడం ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు అలవాటుగా మారిందన్నారు. అందుకే బోగస్ సంజయ్‌కుమార్‌గా పేరు మార్చుకుంటే సరిపోతుందని సూచించారు. అక్షింతల విషయంలో రాముడు ఎక్కడ పుట్టిండనే విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అనని మాటలను అన్నట్టు సృష్టించారని, మంత్రి అన్నట్టు నిరూపించలేకపోతే బండి సంజయ్‌కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. తల్లీబిడ్డల అనుబంధాలపై కూడా అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. దేవుడి పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూడడం కాదు, దేవుడిపై భక్తిని ప్రదర్శించాలని హితవు పలికారు. భూకబ్జాలు, బెదిరింపుల కేసుల్లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కార్పొరేటర్ల భర్తలు, బీఆర్ఎస్ నాయకులు అరెస్టు అయితే దీనిపై ఎందుకు నోరుమెదపటంలేదని ప్రశ్నించారు. కరీంనగర్‌లో ఎన్ని అవినీతి అక్రమాలు, భూకబ్జాలు జరిగినా ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో ఉన్న చీకటి ఒప్పందంలో భాగంగా ఏరోజు మాట్లాడడం లేదని ఆరోపించారు. చీకటి ఒప్పందాలతో రాజకీయాలు చేస్తున్న బండి సంజయ్‌కుమార్‌కు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదని అన్నారు. సమావేశంలో నాయకులు సమద్ నవాబ్, ఖమ్రొద్దీన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దండి రవీందర్, దన్నాసింగ్, మల్లేశం, జీడి రమేష్, మెతుకు కాంతయ్య, ఎండీ చాంద్, మహాలక్ష్మి, మేకల కనుకయ్య, అస్తపురం రమేష్, ముక్క భాస్కర్, సత్యనారాయణరెడ్డి, మహమ్మద్ బారీ, బషీర్, కీర్తి కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ పార్లమెంట్ స్థానం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా డీసీసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ పార్లమెంటు సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి కృష్ణ పులి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పడాల రాహుల్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు సైనికుల్లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల కోసం వెంటనే డోర్ టు డోర్ ప్రచారం ప్రారంభించి, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అయోధ్య రామమందిరాన్ని అడ్డుపెట్టుకుని వచ్చే ఎన్నికలలో ప్రయోజనం పొందాలని చూస్తున్న బీజేపీ నాయకులను ఇంటికి పంపించే వరకు శ్రమించాలన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు

కరీంనగర్ రూరల్, మార్చి 1: జాతీయ అస్ట్రోనమీ, సైన్స్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు పతకాలు సాధించారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే పోటీ పరీక్షల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నవార్క్ ఎడ్యుటెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అస్ట్రోనమి, సైన్స్ మాథ్స్ ఒలింపియాడ్‌లో కె సుచిత్‌రెడ్డి, ఎస్‌పి క్రిష్ణచైతన్య పతకాలు సాధించారన్నారు. విజేతలకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్‌లో వార్షికోత్సవం

కరీంనగర్ టౌన్, మార్చి 1: నగరంలోని మంకమ్మతోట అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి, సరస్వతి మాత విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో చిన్నారులకు ప్రాథమిక స్థాయి నుంచే కళలపై శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నాటికలు, నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, మార్చి 1: అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా గవర్నర్‌గా చెర్మాల వెంకటేశ్వర్లు, మొదటి ఉప గవర్నర్‌గా చీకోటి శ్రీనివాస్‌గాంధీ, రెండో ఉపగవర్నర్‌గా కొంజర్ల మహేశ్, జిల్లా క్యాబినెట్ కార్యదర్శిగా ఎస్ఎల్‌వీఎంఎస్ఎం ప్రసాద్, జిల్లా ట్రెజరర్‌గా సాగర్‌రెడ్డి, క్యాబినెట్ పీఆర్‌వోగా సోమారపు వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, ఈత కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వర్, సిద్దుల బాలకృష్ణ, సిరిపురం సత్యనారాయణ, పుల్లెల శ్యామ్, భూపతి వరుణ్, పండుగ నాగరాజ్, మొగిలోజు సత్యచారి తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించాలి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్ టౌన్, మార్చి 1: శరవేగంగా నలుదిశలా విస్తరిస్తున్న కరీంనగర్ నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను కేటాయించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని 21వ డివిజన్ పరిధిలోని ఆరెపల్లిలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ జంగిలి సాగర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పాలకవర్గం వందల కోట్ల నిధులను తెచ్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామని అన్నారు. ముఖ్యంగా శివారుకాలనీలు, విలీన డివిజన్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను తీర్చేందుకు పెద్దఎత్తున నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలను కల్పించామని, అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం అహర్నిశలు కృషిచేస్తుందని చెప్పారు. మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.200 కోట్లను వెంటనే విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, డివిజన్ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, చైర్మన్

కరీంనగర్ కల్చరల్, మార్చి 1: నగరంలోని విద్యానగర్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధానార్చకుడు వానమామాలై పవన కుమారాచార్యుల ఆధ్వర్యంలో నిత్యహోమం అనంతరం లక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం మేళతాళాలు, ముత్యాల తలంబ్రాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం శ్రీవారు ఉభయ దేవేరులతో కలసి రథంపై ఆలయ సమీప వీధుల్లో విహరించారు.

కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి దూలూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మడతల మీరయ్య, సింగిరెడ్డి రాంరెడ్డి, బానాల మల్లారెడ్డి, కామ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం, చక్రస్నానం, సాయంత్రం గరుడ వాహనసేవ, శ్రీపుష్పయాగం జరుగనున్నాయి. ఉత్సవ పరిసమాప్తిలో భక్తులు పాల్గొని తరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

24 అంశాలకు ఆమోదం

చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ సర్వ సభ్య సమావేశం

పది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరు

కాంగ్రెస్ కౌన్సిలర్లు వచ్చేలోపు ముగింపు



మాట్లాడుతున్న చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు

జమ్మికుంట, మార్చి 1: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో సభ్యులు 24 అంశాలకు ఆమోదం తెలిపారు. అవిశ్వాసం వీగిపోయిన తర్వాత మొదటి సమావేశం కావడంతో సభ్యుల్లో ఉత్కంఠ నెలకొంది. ఉదయం 11గంటలకు సమావేశం జరుగుతుందని సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని చైర్మన్ తమ కౌన్సిల్ సభ్యులకు ఒకరోజు ముందు నోటీసులు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు 11మంది సమావేశానికి హాజరయ్యారు. మేనేజర్ భూపాల్‌రెడ్డి ఎజెండా లో పొందు పరిచిన 24అంశాలను చదివి వినిపించారు. వీటికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అదే సమయానికి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన 14మంది కౌన్సిలర్లు కార్యాలయం లోనికి వచ్చారు. అప్పటికి సమావేశం పూర్తి అయిందని బీఆర్ఎస్ చైర్మన్, కౌన్సిలర్లు బయటకు వెళ్లి పోయారు. కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య తమ కౌన్సిలర్లతో కలిసి కమిషనర్ ఎండి ఆయాజ్‌ను కలిశారు. నిబంధనల ప్రకారం సమావేశం జరిగిందని, ఎజెండాలోని అంశాలపై తీర్మానం చేశారని బదులిచ్చారు. ఆనం తరం కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మాట్లాడుతూ గతంలో పెట్టిన బిల్లులనే మళ్లీ పెట్టారని వివర్శించారు. ప్రజలకు చెందిన ఒక్క రూపాయి కూడా వృథా కానివ్వమన్నారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

జమ్మికుంట, మార్చి 1: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ మేడిగడ్డకు వెళ్లడం సిగ్గు చేటు అన్నారు. ఎన్ని డ్రామాలు చేసిన బీఆర్ఎస్ నాయకులను తెలంగాణ ప్రజలు నమ్మబోరని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

హుజూరాబాద్, మార్చి 1: డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు అన్నారు. ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. డివిజన్‌లో 22,653మంది పిల్లలున్నారని చెప్పారు. వీరి కోసం 185 బూతులు, 800మంది సిబ్బందితో పోలియో చుక్కల కార్యక్రమం నడుస్తుందన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మున్సిపల్, మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్స్ పోలియో బూతులు 40, రూట్ సూపర్‌వైజర్లు 4, మొబైల్ టీం 1 ఏర్పాట చేసినట్లు తెలిపారు.

ప్రైవేటు బస్సు బోల్తా: తప్పిన ప్రమాదం

కరీంనగర్ క్రైం, మార్చి 1: కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రి వద్ద రాజీవ్‌రహదారిపై ఒక ప్రైవేటు బస్సు శుక్రవారం ఉదయం అదుపుతప్పి బోల్తా పడింది. బస్సులో ఉన్న ఒడిషాకు చెందిన కూలీలు కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

మానకొండూర్, మార్చి 1: విద్యార్థులకు పోషకాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని డీడబ్ల్యూవో అధికారి సరస్వతి అన్నారు. మండలంలోని చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై బాస్కరాచారి, ప్రధానోపాధ్యాయులు హఫీజ్‌ఖురేషీ, ఇంద్రసేనారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి అరుణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తిమ్మాపూర్, మార్చి 1: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మొగిళిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు స్నేహిత కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పుల్లారావు, ఏసిడిపీవో అరవింద, సఖి కౌన్సిలర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామడుగు: వెలిశాల జడ్పీ పాఠశాలలో స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో కస్తూరి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అమరులకు నివాళి



హుజూరాబాద్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు

హుజూరాబాద్, మార్చి 1: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 9మంది చనిపోగా, చాలా మంది జైలు పాలయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ రామచంద్రం, ఎం శ్రీనివాస్, టి వసంత్, డి రవీందర్, డి సారయ్య, టి శేఖర్, బి ప్రభాకర్, రాజయ్య, భువనచంద్ర, షడెక్ దేవేందర్, రాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జెంకి అనిల్‌మాదిగ , జిల్లా అధికార ప్రతినిధి తుంగ ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు అంజిబాబు, అంజయ్య, కవ్వంపల్లి రవి, శ్రీనివాస్, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన టూటౌన్ సీఐ



కరీంనగర్ క్రైం, మార్చి 1: ఇటీవల బదిలీపై వచ్చిన రెండో టౌన్ సీఐ ఓ రమేష్ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన సీఐ వెంకటేష్ నుంచి రమేష్ బాధ్యతలు తీసుకున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

కరీంనగర్ టౌన్, మార్చి 1: నగరంలోని 32వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ నగరపాలక సంస్థకమిషనర్‌కు మాజీ కార్పొరేటర్ కోదూరి రవీందర్‌గౌడ్ వినతి పత్రం అందించారు. కట్టరాంపూర్ ప్రాంతంలో స్మార్ట్‌సిటీలో రోడ్డుని మధ్యలోనే నిలిపి వేశారని పనులను పూర్తి చేయాలన్నారు. ఈ విషయంపై రాష్ట్ర మంత్రికి వినతిపత్రం అందించామన్నారు. మంత్రి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనితో పాటు డ్రైనేజీ మధ్యలోనే ఆపివేసిన పనిని పూర్తిచేయాలని ఆయన కోరారు.

ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన తొలగించాలి

భగత్‌నగర్, మార్చి 1: ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ఒక్క నిమిషం నిబంధనను తొలగించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు సుజాతారెడ్డి ఒక ప్రటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక్కనిమిషం ఆలస్యంగా వస్తే అనుమతించబోమన్న ఆలోచనా విధానం బాగాలేదన్నారు. ఒక్కనిమిషం ఆలస్యంగా రావడం వల్ల వచ్చే నష్టం ఏమిటో స్పష్టం చేయాలన్నారు. ఒక్క నిమిషం నిబంధనపెట్టి విద్యార్థులను రెండు సంవత్సరాల చదువుతో పాటు, ప్రాణాలను హరిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు.

రేకుర్తి కంటి ఆస్పత్రి సేవలు అభినందనీయం



డీఎఫ్‌వోను సన్మానిస్తున్న కొండా వేణుమూర్తి

కరీంనగర్ రూరల్, మార్చి 1: రేకుర్తి కంటి ఆస్పత్రి సేవలు అభినందనీయమని కరీంనగర్, సిరిసిల్ల డీఎఫ్‌వో సీహెచ్ బాలమణి అన్నారు. నగరంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో డీఎఫ్‌వో సీహెచ్ బాలమణి ఏ-స్కాన్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేకుర్తి కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయమన్నారు. ఆసుపత్రి ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో హరితహారం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు డాక్టర్ మురళీధర్‌రావు, అన్నారెడ్డి పాల్గొన్నారు.

దోమల బెడదను నివారించాలి

భగత్‌నగర్, మార్చి 1: నగరంలో అన్ని వాడల్లో ఫాగింగ్ చేసి దోమల బెడదను నివారించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని డివిజన్లలో దోమల నియంత్రణ మందు స్ప్రే చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్పొరేషన్ అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు పరిపసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సమ్మక్క జాతర సొమ్ము కోసం ఘర్షణ?

హుజూరాబాద్, మార్చి 1: పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతర సొమ్ము కోసం చైర్మన్, డైరెక్టర్ల మధ్య ఘర్షణ నెలకొన్నట్లు తెలిసింది. గురువారం సమ్మక్క హుండీని పోలీస్‌స్టేషన్ ఆవరణలో లెక్కించగా రూ. 15లక్షలకు పైగా వచ్చాయి. శుక్రవారం ఈ సొమ్మును పంచుకోవడం కోసం జాతర కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గొడవ పెట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ కుర్చొని మాట్లాడుకోవాలని వారిని హెచ్చరించినట్లు తెలిసింది. డబ్బుల కోసం కొట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది.

మేడిగడ్డను సందర్శించిన నాయకులు

గంగాధర, మార్చి 1: గంగాధర మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మేడిగడ్డను సందర్శించారు. నవీన్‌రావు, కంకణాల విజేందర్‌రెడ్డి, మధుసూదన్‌లు మాట్లాడుతూ బ్యారేజ్‌లో ఒక్క పిల్లరు దెబ్బతినగా కాంగ్రెస్ నాయకులు భూతద్దంలో చూపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాపర్ డ్యాంను నిర్మించి వెంటనే రైతులకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

చొప్పదండి, మార్చి 1: చొప్పదండి పట్టణంలోని చిట్టి గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు ప్రారంభించారు. కాగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిజానపురం చందు 300 మందికి మజ్జిగను పంపిణి చేశారు. కార్యక్రమంలో చిట్టి గ్రూపు సభ్యులు మహేశుని మల్లేశం, జిట్టా కుమార్, మహమ్మద్ చాంద్‌పాషా, వొడెల రవికాంత్, అమరగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

తిమ్మాపూర్, మార్చి1: మండలంలోని మన్నెపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రిని అందజేశారు. పొన్నం యువసేన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు పొన్నం అనిల్‌గౌడ్ సమక్షంలో వీటిని అందజేశారు. లయన్స్ క్లబ్ సహకారంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, కుటుంబ సభ్యులకు అన్నదానం నిర్వహించారు.

యువతికి సన్మానం

రామడుగు, మార్చి 1 మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రైతు ఎడవల్లి కిషన్‌రెడ్డి కూతురు అంజలి ఏకకాలంలో 4 ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడంతో శుక్రవారం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సన్మానం చేశారు. ఇటీవలే పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్ ఉద్యోగం సాధించిన అంజలి ప్రస్తుతం టీజీటీ జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలను సైతం సాధించింది.

ఎంపీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

రామడుగు, మార్చి 1: ఎంపీ బండి సంజయ్‌కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయన తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రామడుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చొప్పదండి అసెంబ్లీ ఉపాధ్యక్షుడు మామిడి దిలీప్‌కుమార్, బుర్ర శ్రీనివాస్, మనోహర్, గణేష్ పాల్గొన్నారు.

ఐఏఎస్ నరహరి జన్మదిన వేడుకలు

శంకరపట్నం, మార్చి 1: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు బొంగోని అభిలాష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జక్కుని సంజయ్‌కుమార్, జీడీ వెంకటేష్, కిశోర్, గణేష్ పాల్గొన్నారు.